నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

## ప్రతి చిన్నారికి చదివే హక్కు

ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి చిన్నారికి చదివే హక్కు ఉందని సుప్రీంకోర్ట్ తీర్పు చెప్పింది. రోహింగ్యా శరణార్థుల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో సీటు ఇవ్వరాదంటూ 2024లో ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనను సుప్రీంకోర్ట్ కొట్టి వేసింది. ప్రాథమిక విద్య ప్రాథమిక హక్కుగా చిన్నారులందరికీ వర్తిస్తుందని స్పష్టంగా పేర్కొంది.

nipuna
Every Wednesday Free Supplement
19 ఫిబ్రవరి 2025
పేజీలు 8

## జాతీయం

### మోదీ ఫ్రాన్స్ పర్యటన

- కృత్రిమ మేధపై నిర్వహించిన సదస్సులో పాల్గొనేందుకు ఫిబ్రవరి 10 నుంచి 12 మధ్య ఫ్రాన్స్ కు ప్రధాని మోదీ వెళ్లారు. ఆ తర్వాత 12 నుంచి 14 మధ్య అమెరికాకు వెళ్లారు.

**ఫ్రాన్స్ పర్యటనలో..**

- స్మాల్ మాడ్యూలర్ రియాక్టర్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఇరు దేశాలు ఉద్దేశ పత్రాలను పంచుకున్నాయి.
- జైతాపూర్ అణు ప్లాంట్ పురోగతిని సమీక్షించాయి.
- యుద్ధ విమానాలు, ఇంజిన్లు కలిసి ఉత్పత్తి చేసే విషయంపైన ఇరు దేశాలు చర్చించాయి.
- భారత్‌కు చెందిన పినాకా మల్టీ బారెల్ రాకెట్ లాంచర్ పట్ల ఫ్రాన్స్ ఆసక్తి చూపింది.
- కృత్రిమ మేధ విషయంలో భద్రత, విశ్వసనీ




యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. అలాగే 2026లో నిర్వహించనున్న కృత్రిమ మేధ సదస్సును భారత్‌లో నిర్వహించేందుకు ప్రతిపాదన వచ్చింది. అలాగే 2026ను 'భారత్-ఫ్రాన్స్ సృజనాత్మక సంవత్సరంగా' ప్రకటించాయి.

**అమెరికా పర్యటనలో..**

- రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్‌తో మోదీ చర్చించారు. ఈ సందర్భంగా ఇరువురు సీవోఎంపీఏసీటీ (కంపాక్ట్)ను ప్రారంభించారు. దీని పూర్తి రూపం- క్యాటలైజింగ్ ఆపర్చునిటీస్ ఫర్ మిలిటరీ పార్ట్‌నర్ షిప్, యాక్సిలరేటెడ్ కామర్స్-టెక్నాలజీ. అంటే సైన్యం, వాణిజ్యం కోసం ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం అని అర్థం.

**మణిపూర్**

- రాజ్యాంగ యంత్రాంగం విఫలం కావడంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. గవర్నర్ నివేదిక మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర శాసనభను సుప్త చేతనావస్థ స్థితిలో ఉంచారు. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం ఇది 11వ సారి.

**ఎలీ ఏనుగు**



- ఆసియాలోనే తొలి యానిమెట్రోనిక్ ఏనుగు ఎలీని బెంగళూరులో ఆవిష్కరించారు. జంతు సంరక్షణ కోసం పోరాడే పెటా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. జంతు సంక్షేమం గురించి చిన్నారులకు అవగాహన కల్పించేందుకు దీన్ని ప్రవేశపెట్టారు.

**అవినీతి సూచి**

- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన అవినీతి సూచిలో భారత్ 96వ స్థానంలో నిలిచింది. మొత్తం 180 దేశాలకు ర్యాంకింగ్ ఇచ్చారు. భారత్ 38 మార్కుల స్కోర్ చేయగలిగింది. ఈ జాబితాలో డెన్మార్క్ అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత ఫిన్లాండ్, సింగపూర్ నిలిచాయి. భారత్‌కు పొరుగున ఉన్న దేశాలను పరిశీలిస్తే శ్రీలంక 121వ స్థానంలో, బంగ్లాదేశ్ 149వ స్థానంలో పాకిస్థాన్ 135వ స్థానాల్లో ఉన్నాయి. చైనా 76వ స్థానంలో ఉంది. అత్యంత అవినీతి దేశంగా చివరి ర్యాంకును దక్షిణ సూడాన్ పొందింది. ఆ దేశానికి కేవలం 8 మార్కులు దక్కాయి. దానిపైన సోమాలియా నిలిచింది.




## అంతర్జాతీయం

### ప్రపంచ ఆరోగ్య సంస్థ

- చిన్నారులకు క్యాన్సర్ ఔషధాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ, సెయింట్ జూడ్ చిల్డ్రన్ రీసెర్చ్ ఆస్పత్రులు సంయుక్తంగా ప్రారంభించాయి. మొదట ఉజ్బెకిస్థాన్, మంగోలియాకు ఔషధాలను ఇచ్చారు. ఇందుకు 'చిన్నారులకు క్యాన్సర్



ఔషధాల అందుబాటు ప్రపంచ వేదిక' అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈక్వెడార్, జోర్డాన్, నేపాల్, జాంబియా దేశాల్లోనూ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది.

**ప్రపంచ ఆహార సంస్థ**

- వ్యవసాయ ఆహార వ్యవస్థను సోమాలియాలో పటిష్ఠం చేసేందుకు ఉగ్బాద్ అనే పేరుతో ప్రపంచ ఆహార సంస్థ కొత్త విధానాన్ని చేపట్టింది. 95 మిలియన్ డాలర్లను ఇందుకు వ్యయం చేయనుంది.

**జపాన్**

- ప్రపంచంలోనే తొలి హైబ్రిడ్ క్వాంటం సూపర్ కంప్యూటర్‌ను జపాన్‌లో ఆవిష్కరించారు. దీని పేరు రెయిమి. ప్రపంచంలో ఆరో అతి వేగవంతమైన సూపర్ కంప్యూటర్ పుగాకుతో రెయిమిని అనుసంధానం చేశారు. సంక్లిష్టమైన గణిత సమస్యలను కూడా సులువుగా పరిష్కరించేందుకు ఇది



దోహదం చేస్తుంది.

**కొరియా**

- అవస్థాపన, మౌలిక సౌకర్యాల పెంపునకు భారత్‌కు చెందిన డీపీఐఐటీ, కొరియాకు చెందిన కొరియా ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్టిట్యూట్‌లు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ అమలుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది.

## రోజులు-ప్రాధాన్యం

### ఫిబ్రవరి 13

- ఏటా ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ రోజు స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజినీ నాయుడు జయంతి. ఆమె హైదరాబాద్‌లో జన్మించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గవర్నర్ పదవిని చేపట్టిన తొలి మహిళ ఆమె. ఫ్లారెన్స్ నైటింగేల్ ఆఫ్ ఇండియా అనే పేరు కూడా ఆమెకు ఉంది. అలాగే ప్రతి ఏడాది ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో రోజుగా కూడా నిర్వహిస్తారు.

**ఫిబ్రవరి 11**

- మహిళలు, బాలికల శాస్త్ర విజ్ఞాన అంతర్జాతీయ రోజుగా ఏటా ఫిబ్రవరి 11న నిర్వహిస్తారు. యునెస్కో, యూఎన్ ఉమెన్ సంయుక్తంగా ఈ రోజును నిర్వహిస్తున్నాయి.

**ఫిబ్రవరి 10**

- ప్రపంచ పప్పు ధాన్యాల రోజుగా ఏటా ఫిబ్రవరి 10న నిర్వహిస్తారు.

## క్రీడలు

### శిఖర్ ధావన్

- త్వరలో ప్రారంభం కానున్న చాంపియన్స్ ట్రోఫీకి రాయబారిగా శిఖర్ ధావన్‌ను ఎంపిక చేశారు. ఇప్పటికే ఈ పాత్రలో సర్ఫరాజ్ అహ్మద్, షేన్ వాట్సన్, టిమ్ సౌథీ ఉన్నారు.

**షోలే అఖ్తర్**

- బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ షోలే అఖ్తర్‌ను



అవినీతి కారణంతో ఐసీసీ సస్పెండ్ చేసింది. మహిళల క్రికెట్‌లో ఇప్పటి వరకు సస్పెన్షన్‌కు గురైన తొలి క్రికెటర్ ఆమే.

**39వ జాతీయ క్రీడలు**

- 2027 ఫిబ్రవరి/మార్చి నెలల్లో 39వ జాతీయ క్రీడలకు మేఘాలయ వేదిక కానుంది. 38వ జాతీయ క్రీడలు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

**రోహిత్ శర్మ**

- వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌గా రెండో స్థానానికి రోహిత్ శర్మ వచ్చాడు. ఫిబ్రవరి 9న ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఇప్పటివరకు రోహిత్ 332 సిక్సర్లు కొట్టాడు. షాహిద్ అఫ్రిదీ అగ్రస్థానంలో ఉన్నాడు.




**మాథ్యూ బ్రీట్జ్కే**

- దక్షిణాఫ్రికాకు చెందిన క్రికెటర్ మాథ్యూ బ్రీట్జ్కే తన తొలి వన్డే మ్యాచ్‌లోనే 150 పరుగులు సాధించాడు. అతడు ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడు. వెస్టిండీస్‌కు చెందిన హేన్స్ గతంలో తన తొలి వన్డేలో 148 పరుగులు సాధించాడు. ఆ రికార్డ్ మాథ్యూ అధిగమించాడు.

## తెలంగాణ

### సిద్దిపేటలో ప్రపంచ రికార్డ్

- శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన సిద్దిపేటలో ఫిబ్రవరి 9న నిర్వహించారు. ప్రభుత్వ బాలికల విద్యా సముదాయ ప్రాంగణంలో ఇది కొనసాగింది. రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 1484 మంది యోగ సాధకులు వచ్చారు. ఏడు ఆసనాలు, 12 భంగిమలతో సూర్య నమస్కారాలు చేశారు. మొత్తం 4,02,154 సూర్య నమస్కారాలు చేశారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ప్రదర్శనకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.



**ఐటీ టవర్**

- ఐటీ అభివృద్ధిని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా వనపర్తిలో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రెండు ఎకరాలు కేటాయించడంతో పాటు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టవర్ నిర్మించేందుకు రూ. 22 కోట్లు మంజూరు చేశారు.

**స్వమిత్వ సర్వే**

- స్వమిత్వ పథకం కింద తెలంగాణలో ఐదు గ్రామాల్లో సర్వే పూర్తయిందని కేంద్రం ప్రకటించింది. ఈ పథకానికి 2022 ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వంతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. ఆదిలాబాద్ జిల్లాలోని అర్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో గోధుమ కుంట, రంగారెడ్డి జిల్లా సరస్వతి గూడ, జనగామ జిల్లా ఘనపూర్, కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు.

**జియో ట్యూబ్**

- గోదావరి వరద ముప్పు నివారించేందుకు ములుగు జిల్లా ఏటూరు నాగారం నుంచి రామన్నగూడెం మీదుగా 20 సంవత్సరాల కిందట కరకట్ట నిర్మించారు. వరద తాకిడితో రామన్నగూడెం వద్ద ఇది కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి నీటి పారుదల శాఖ అధికారులు రాష్ట్రంలోనే తొలిసారి జియోట్యూబ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా వినియోగించనున్నారు. ట్యూబ్‌లలో ఇసుకను నింపి కరకట్ట ఎక్కడయితే కోతకు గురైందో అక్కడ ఏర్పాటు చేస్తారు. దాదాపు 225 మీటర్లు వీటిని ఏర్పాటు చేయనున్నారు.

**జియో ట్యాగింగ్**



- తెలంగాణలో విద్యుత్ స్తంభాలకు జియో ట్యాగింగ్ ఇచ్చే కార్యక్రమం మొదలైంది. జగిత్యాల జిల్లాలో దీనికి శ్రీకారం చుట్టారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ దీన్ని చేపట్టింది. జియో ట్యాగింగ్‌తో అనుసంధానంతో విద్యుత్ లైన్లలో ఎక్కడ సమస్య తలెత్తినా ఆ ప్రాంతాన్ని సులువుగా గుర్తిస్తారు. విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ ఎంత దూరంలో ఉందో తెలుసుకునే వీలు కూడా ఇందులో ఉంది.

**గూగుల్ ఏఐ కేంద్రం**

- హైదరాబాద్‌లో ఏఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గూగుల్ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుంది. కృత్రిమ మేధ అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటును అందించనుంది. వ్యవసాయం, విద్య, రవాణా రంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సహకరించనుంది.

**మైక్రోసాఫ్ట్ శిక్షణ**

- రాష్ట్రంలోని విద్యార్థులు, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేసింది. కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 13న ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రానికి, మైక్రోసాఫ్ట్‌కు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు ఏఐ ఫౌండేషన్ అకా



డమీని ప్రారంభిస్తుంది. దీని ద్వారా దాదాపు 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. ఏఐ ఇండస్ట్రీ ప్రో అనే మరో కార్యక్రమంలో రాష్ట్రం అంతటా 20 వేల మంది పరిశ్రమ నిపుణులకు నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణ ఇస్తుంది. ఏఐ-సీఈవో అనే కార్యక్రమంలో 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు సైబర్ భద్రత, డిజిటల్ ప్రొడక్టివిటీ తదితర కీలక రంగాల్లో శిక్షణ ఇస్తుంది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

